డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు చర్యలు



డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

– ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్ ఆధునీకరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ మున్సిపల్ క్వార్టర్స్ వద్ద రూ.12 లక్షల 50 వేలు, పూల్‌బాగ్‌లో రూ.5.3 లక్షలు, ఎల్‌ఐసీ కాలనీ వద్ద రూ.10 లక్షలతో నిర్మించతలపెట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే గోపాల్, స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నాణ్యత పాటించి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, మీసాల విఠల్‌రావు, బీఆర్‌ఎస్ యువ నాయకులు ముఠా జైసింహా, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డి సాయికృష్ణ, నాయకులు రాజశేఖర్‌గౌడ్, ప్రభాకర్, శ్రీనివాస్ యాదవ్, శ్రీహరి, బీజేపీ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, నాయకులు ఆంజనేయులు, విష్ణు, వాటర్ వర్క్స్ డీజీఎం కార్తిక్ రెడ్డి, మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

సొసైటీపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి'



మాట్లాడుతున్న బీటీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎం.సత్యనారాయణ గౌడ్

కాచిగూడ: కొందరు తప్పుడు ప్రచారంతో బీటీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సభ్యులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎం.సత్యనారాయణ గౌడ్ అన్నారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో కార్యదర్శి జి.మల్లారెడ్డి, కోశాధికారి ఎ.శ్రీనివాస్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏవైనా సందేహాలు, అనుమానులుంటే సొసైటీ కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవాలని సభ్యులకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలోనే సభ్యులందరికీ ఇళ్ళ స్థలాలు రావాల్సి ఉన్నా కొన్ని కారణాలతో నిలిచిపోయిందన్నారు. ప్రభుత్వం మారడంతో ఇప్పటికే సొసైటీ విషయమై మంత్రులకు వివరించామని, ముఖ్యమంత్రిని కలిసి మెమోరాండం అందజేశామని తెలిపారు. సభ్యులందరికీ ఇళ్ళ స్థలాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి కూడా సానుకూలంగానే ఉన్నారని చెప్పారు. సొసైటీపట్ల తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, వారిపై పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులను, సంబంధిత శాఖల ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించామని తెలిపారు.

ఆది నాగేష్ సేవలు చిరస్మరణీయం



కాచిగూడ: బీజేపీ సీనియర్ నేత, మున్నూరుకాపు మహాసభ కార్యవర్గ సభ్యులు ఆది నాగేష్ మున్నూరుకాపులకు అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో ఆది నగేష్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపుల సంక్షేమం కోసం ఆది నగేష్ అందించిన సేవలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆది రజిత రాణి, ఆది వంశీకృష్ణ, ఎనుగుల తరుణ్, ఎనుగుల హరిప్రియ, కొండూరు వినోద్ కుమార్, లింగిశెట్టి హనుమంతరావు, కొంతం సురేష్, ఎనుగుల మాణిక్ ప్రభు, హజారి రాంమోహన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవాస భారతీయులకు గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి

– అంసోల్ లక్ష్మణ్ డిమాండ్



కవాడిగూడ: గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ. 500 కోట్ల బడ్జెట్‌తో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, బహుజన ముక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఆ పార్టీ నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జీ దేవతీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గల్ఫ్ సంక్షేమ బోర్డు సాధన కోసం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన అంసోల్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఉపాధికోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గల్ఫ్ దేశాలలో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ఇతర దేశాలలో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ దేశాల జైళ్లలో మగ్గుతున్న ప్రవాస భారతీయులకు న్యాయ సలహాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన ముక్తి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వలిగె ప్రభాకర్, బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ధర్మయ్య, ప్రధాన కార్యదర్శి జి.శ్యామలరాజు, మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పులేటి రాజేందర్, నాయకులు మేకల దాసు, కీర్తి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు ఉత్తర్వులు జారీ చేయాలి



కాచిగూడ: సామాజిక, ఆర్థిక సర్వేకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయకపోవడంపట్ల బీసీలు నిరాశకు గురవుతున్నారని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. కాచిగూడలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ చిత్తశుద్ధిపై ఎలాంటి అపనమ్మకం లేదని, కానీ అలస్యం అవుతుండటం వల్ల కులసర్వే ప్రక్రియ ఆరంభానికి బ్రేక్ పడే ప్రమాదం ఉందని అన్నారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశమున్నందున కుల సర్వేకు సంబంధించి ప్రభుత్వ నిర్ణయాన్ని ఉత్తర్వుల రూపంలో వెంటనే జారీ చేయాలని కుమారస్వామి కోరారు.

నాలా పూడికతీతలు సకాలంలో పూర్తి చేయాలి

అంబర్‌పేట్: నాలా పూడికతీత పనులను పకడ్బందీగా చేపట్టాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ అధికారులకు సూచించారు. సోమవారం డివిజన్‌లో పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్ ప్రాంతాల్లో నాలా పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. వేసవికాలం ముగిసేలోపు డివిజన్‌లోని అన్ని నాలాల పూడికతీత చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గా, ఇతర అధికారులు ఉన్నారు.



యూకేజీ పట్టాలు.. మురిసిన చిన్నారులు



అంబర్‌పేట్: చిన్నారులు పట్టాలు అందుకొని మురిసిపోయారు. సోమవారం డీడీ కాలనీలోని బాచ్‌పన్ పాఠశాలలో యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ రూపరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి చిన్నారులకు యూకేజీ పట్టాలు అందించారు.

విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత: పొన్నం

- ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం ప్రారంభం
- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- 200 యూనిట్లలోపు ఉన్న పేదలకు జీరో కరెంటు బిల్లు పంపిణీ



సభలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం ముషీరాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.57 లక్షలతో మౌలిక వసతుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ముషీరాబాద్ ప్రధాన రహదారిలో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్‌ఆర్‌డీ) సంస్థ సహకారంతో డాక్టర్ విజయ్‌కుమార్ దాట్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.మూడు కోట్లతో నిర్మించిన ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ముషీరాబాద్‌లోని దళిత బస్తీలో 200 యూనిట్లలోపు ఉన్నవారికి జీవో బిల్లులను పంపిణీ చేశారు. మన బడి, మన బస్తీ కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల లేమితో బాధపడకుండా కార్పొరేట్ విద్యా సంస్థల స్థాయిలో మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. డాక్టర్ విజయ్‌కుమార్ దాట్లా ఫౌండేషన్, బీఈ కంపెనీ యాజమాన్యం మూడు కోట్ల రూపాయలు భవన నిర్మాణానికి ఇవ్వడంతోపాటు మరో 12 లక్షలు ఆసుపత్రిలో ఫర్నిచర్ ఏర్పాటుకు నిధులు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి, డీఈవో రోహిణీ, జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి, భోలక్‌పూర్ డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్, విజయ్‌కుమార్ దాట్లా ఫౌండేషన్ ట్రస్టీ, బీఈ కంపెనీ డైరెక్టర్ ఇందిర, మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఐ.వై.ఆర్.కృష్ణారావులతో కలిసి మంత్రి ఈ మూడు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.



డా.దాట్లా విజయ్‌కుమార్ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభాకర్ తదితరులు

జీరో విద్యుత్ బిల్లుల పంపిణీ

ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అన్ని హామీలను అమలు చేస్తామని మంత్రి ప్రభాకర్ స్పష్టం చేశారు. ముషీరాబాద్ కృష్ణా కాలనీలోని వీరభారత సేవా సమాజ్‌కు చెందిన దళిత బస్తీలో 200 యూనిట్లలోపు వచ్చిన ఇళ్లల్లోకి వెళ్లి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి జీరో బిల్లులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, వై.శ్రీనివాస్, డి.శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్నం నాగభూషణం గౌడ్, మేడి సురేష్, కార్పొరేటర్ సుప్రియన వీన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, ఆర్.కల్పనాయాదవ్ లతో పాటు ఉపాధ్యాయులు, డాక్టర్లు, విద్యుత్ శాఖ సీజీఎం నర్సింహ్మస్వామి, బ్రహ్మం, డీఈ ఆజామాబాద్ కమల్‌కుమార్, ఏడీఈ భర్కత్‌పురా శ్రీనివాస్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం

మోదీ పర్యటనను విజయవంతం చేయండి

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు



కాచిగూడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రధానమంత్రి ప్రత్యేక పూజలు చేయనున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, కృష్ణాగౌడ్, సందీప్‌సాయి, ఎడెల్లి అజయ్ కుమార్, కార్పొరేటర్ వై.అమృత తదితరులు పాల్గొన్నారు.

దుర్గారెడ్డికి జాతీయ సేవారత్న అవార్డు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ సంఘ సేవకులు, ఫ్యామిలీ కౌన్సెలర్ బి.దుర్గారెడ్డిని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సేవా రత్న అవార్డుతో సత్కరించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అకాడామీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. దుర్గారెడ్డి పేద పిల్లల చదువు కోసం ఆర్థిక సహాయం చేయడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ ద్వారా ఎన్నో జంటలను ఒకటిగా చేశారని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలను బహుజన సాహిత్య అకాడమీ గుర్తించి జాతీయ సేవా రత్న అవార్డుతో సత్కరించింది.

ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.నిరంజన్



ముషీరాబాద్: ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.నిరంజన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆర్.నిరంజన్ రాచకొండ కమీషనరేట్ పరిధిలోని హయాత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ రవి రాచకొండ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న వెంకట్‌రెడ్డి టాస్క్‌ఫోర్స్‌కు బదిలీకాగా ఆయన స్థానంలో సంగారెడ్డి నుంచి శివలింగం బదిలీపై రానున్నారు.

24 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

మహాధర్నాలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



ధర్నా చేస్తున్న డీఎస్సీ అభ్యర్థుల ధర్నాకు మద్దతు తెలుపుతున్న ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 24 వేల టీచర్ పోస్టులతోపాటు 20 ఏళ్లుగా ఖాళీగా ఉన్న 5 వేల ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద తెలంగాణ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో టెట్‌తో పాటు 24 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ సాధన కోసం మహాధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ టెట్, డీఎస్సీ నోటిఫికేషన్‌లను ఒకేసారి విడుదల చేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నించారు. విద్య కోసం కేటాయించే బడ్జెట్‌ను ప్రభుత్వాలు ఖర్చుగా భావించవద్దని సూచించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రమోషన్లు, రిటైర్‌మెంట్లతో ఖాళీలైన టీచర్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15 వేల పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్ట్‌లను బోధించే టీచర్లు లేరని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు తగ్గిపోయి జాతీయస్థాయి పోటీపరీక్షలైన ఇంజనీరింగ్, నీట్ వంటి పోటీ పరీక్షలలో ఇతర రాష్ట్రాల విద్యార్థులతో పోటీ పడలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలవెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ నేతలు గువ్వల భరత్, నందగోపాల్, వి. రామకృష్ణ, నర్సింహాగౌడ్, పోతులారం కృష్ణ, ప్రీతం, రాందేవ్, ఉదయ్, సతీష్, నిఖిల్, రఘుపతి, కరుణశ్రీ, జయంతి తదితరులు పాల్గొన్నారు.

సామాజికసేవలో భాగస్వాములు కావాలి

హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు కొండారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, అప్పుడే సమాజానికి కొంత మేలు జరుగుతుందని హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు కొండారెడ్డి అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద కందూరి కృష్ణ ఫౌండేషన్, సేత్ మాణిక్ లాల్ జీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పేదలు, విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొండారెడ్డి మాట్లాడుతూ రెండు ఫౌండేషన్‌ల ద్వారా నిత్యం 1,500 మందికి అల్పాహారాన్ని పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కందూరి కృష్ణా, ప్రమోద్ అగర్వాల్, అడ్వకేట్ కె.కౌశిక్, ఇన్‌కమ్ ట్యాక్స్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హెచ్. గోవింద్‌రావు, డాక్టర్ సంగీత, జ్వాలా వరాలిని తదితరులు పాల్గొన్నారు.



కురవి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా మల్లికార్జున్



కాచిగూడ: కురవి భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా నగరానికి చెందిన కాసుల మల్లికార్జున్‌ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కాచిగూడలోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో మల్లికార్జున్‌ను మున్నూరుకాపు సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కురవి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా నియమించిన ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించే విధంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

శుభాకాంక్షలు



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గత రెండుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా నియమించడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముషీరాబాద్‌లో ఘనంగా సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గంజి వరద రాజు, కరణం సురేష్, విజయ్‌యాదవ్, రామకృష్ణా, ప్రసాద్ తదితరులు అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఘనంగా గజమాలతో గధను బహుకరించి సత్కరించారు.

లక్ష్మీనారాయణ ముదిరాజ్‌కు నివాళి

కాచిగూడ: స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే నెల్లి లక్ష్మీనారాయణ ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా సోమవారం గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పలువురు ముదిరాజ్ సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్, అల్లం దుర్గం సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొని ప్రసంగించారు. గన్‌పార్క్ అమరవీరుల స్థూప నిర్మాణ సారథి నెల్లి లక్ష్మీనారాయణ ముదిరాజ్ అని వారు అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్, సైదులు, పృథ్వీరాజ్, మురళీ మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు



మల్లికార్జుననగర్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట్: ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో మల్లికార్జున్‌నగర్, తురాబ్‌నగర్‌లలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో ప్రజల అవసరాలకనుగుణంగా భారీ ఎత్తున్న అభివృద్ధి పనులు చేపటినట్లు ఆయన వెల్లడించారు. పార్కుల అభివృద్ధి రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, పైపులైన్ వ్యవస్థ వంటి పనులను విస్తృతంగా చేపట్టి పూర్తి చేసినట్లు చెప్పారు. అనంతరం ఆయన అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి స్థానికంగా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, చందు, శ్రీరాములు ముదిరాజ్, జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రెడ్డి, మేనేజర్ మాజిద్ పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు రుణాల పంపిణీ



నల్లకుంట: మహిళాపొదుపు సంఘాలకు బ్యాంకులు అందించే రుణాలతో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యకిషన్‌రెడ్డి మహిళలకు సూచించారు. ఆదివారం నల్లకుంటలో కార్పొరేటర్ అమృత అధ్యక్షతన తిలక్‌నగర్, జీవయ్యనగర్ పొదుపు సంఘాల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కావ్యకిషన్‌రెడ్డి రెండు పొదుపు సంఘాలకు బ్యాంకు మంజూరు చేసిన రూ.11 లక్షలు, రూ.12 లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మహిళామోర్చా నాయకులు, పొదుపు సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కాచిగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మెడికోవర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాకేష్ రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ శృతి అన్నారు. మెడికోవర్ హాస్పిటల్ బేగంపేట బ్రాంచి ఆధ్వర్యంలో సోమవారం హసన్ హెల్త్ సెంటర్‌లో మెగా ఉచిత వైద్యశిబిరంలో నిర్వహించి ప్రజలకు సేవలు అందించారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ నడకతో పాటు వ్యాయామం అలవాటు చేసుకోవాలన్నారు. వైద్యశిబిరంలో దాదాపు 250 మంది వివిధ పరీక్షలు చేయించుకున్నారు. మెడికోవర్ హాస్పిటల్ బేగంపేట బ్రాంచి హెడ్ రాజ్‌కుమార్, మేనేజర్ వినోద్ కుమార్, సునిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలి



డీఎంసీకి ఫిర్యాదు చేస్తున్న చింతాల శ్రీనివాస్ ముదిరాజ్

అంబర్‌పేట్: కాలనీ ముందు పుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ కాలనీ రెసిడెన్సీ అసోసియేషన్ అధ్యక్షులు చింతాల శ్రీనివాస్ ముదిరాజ్, డీఎంసీ మారుతీదివాకర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్ ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కాలనీ పుట్‌పాత్ ఆక్రమణకు గురికావడంతో ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

'కిషన్‌రెడ్డిని తిరిగి ఎంపీగా గెలిపించుకుందాం'

చిక్కడపల్లి: కిషన్‌రెడ్డిని తిరిగి ఎంపీగా గెలిపించుకుందామని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజవర్గం జాయింట్ కన్వీనర్‌గా నియమితులైన పార్టీ సీనియర్ నేత ఎ.వినయ్‌కుమార్ అన్నారు. వినయ్‌కుమార్‌ను సోమవారం గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో విస్తృతంగా పర్యటించి అభ్యర్థి గెలుపుకు పనిచేస్తామని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు వీఎస్టీ రాజు, జి.శ్రీకాంత్, గాదె శ్రీనివాస్, ఎం.సాయికుమార్ , విజయలక్ష్మి, తులసి, సాయి, తరుణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధి శిక్షణాకేంద్రాల ఏర్పాటు

చిక్కడపల్లి: మహిళాసాధికారత, ఆర్థిక అభివృద్ధికి శిక్షణాకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, వీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణకేంద్రాన్ని సోమవారం డివిజన్‌లోని వీవీ గిరినగర్ నూతన కమ్యూనిటీహాల్‌లో ఆమె ప్రారంభించారు. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ స్వయంగా అందజేసిన 10 కుట్టుమిషన్‌లతో శిక్షణకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరీష్‌రెడ్డి, అధ్యక్షుడు మధు, ప్రాజెక్ట్ చైర్మన్ శేరిపల్లి గణేష్ పద్మశాలి, కమల్కర్ ముష్యల, ప్రకాష్, శ్రీకాంత్, వీఎస్టీ రాజు, పాలశ్రీను, నవీన్‌కుమార్, సాయికుమార్, ఆనంద్‌రావు, తులసి, విజయలక్ష్మి, సంధ్యారాణి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కాచిగూడ: అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెంది ఉన్నాడు. మృతుడి ఒంటిపై యెల్లో కలర్ హుడి, గ్రేకలర్ ఫ్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.